

వైద్యులపై దౌర్జన్యకాండ

వైద్యులు దైవంతో సమానం అంటారు.. అలాంటి వారిపై కూటమి మద్దతుదారుల దాడులు అధికమయ్యాయి. అలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం.


8లో



జన గళమే జానపదం..

జన గళమే జానపదం.. ఇది మన సంస్కృతికి ఆలవాలం.. నేటి రోజుల్లోనూ జానపదానికి గుర్తింపు పదిలం. పూర్వపు తూర్పుగోదావరి జిల్లా జానపద కళాకారులకు పెట్టింది పేరు.

సముద్రంలోకి 2.86 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 2,86,532 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులుగా ఉంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 14 వేల క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

యువతకు ఉద్యోగ అవకాశం

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జెన్పాక్ట్ ఆధ్వర్యంలో 1,500 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కొండలరావు బుధవారం ఈ విషయం తెలిపారు. కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్ వాయిస్ సపోర్ట్ విభాగాలలో ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. 2022/2023/2024 సంవత్సరాలలో డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి, కమ్యూనికేషన్స్ స్కిల్స్ కలిగిన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలవారు https://bit.ly/46 Wzqz6 లో వివరాలు నమోదు చేసుకోవాలని, అవసరమైతే 99888 53335 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పంటల బీమా పథకాలు కీలకం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): వాతావరణంలో మార్పు, ప్రకృతి వైపరీత్యాలు, వ్యవసాయ మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గుల కారణంగా రైతు నష్టపోకుండా ప్రభుత్వం పంటల బీమా విధానాన్ని ప్రవేశపెట్టిందని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంటల బీమా పథకం, పంట కోత ప్రయోగాలు, ఈ – పంట పై జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ ప్రతి రైతు తాను పండించే పంట ఈ – పంట నమోదు తప్పనిసరిగా చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంట కోత ప్రయోగాలను పక్కా గా నిర్వహించి ఖచ్చితమైన దిగుబడులను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 96 శాతం కౌలు రైతుల కార్డుల నమోదు, 48 వేల ఎకరాలలో ఈ పంట (ఈ క్రాప్ బుకింగ్) నమోదు జరిగిందన్నారు. జిల్లాలో ఈ – పంటలో భాగంగా వ్యవసాయ రంగంలో 85,684 ఎకరాలు, హార్టికల్చర్ రంగంలో 50,372 ఎకరాలు సాగు విస్తీర్ణంలో ఉందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.సుజాతకుమారి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ, ఏడీఏలు, తహసీల్దారులు పాల్గొన్నారు.


30న రత్నగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అన్నవరం: అన్నవరం శ్రీ వీరవెంకటసత్యనారాయణస్వామి దేవస్థానంలో శ్రావణమాసంలో నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఈ నెల 30వ తేదీ, చివరి శ్రావణ శుక్రవారం నిర్వహించనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు రత్నగిరిపై స్వామివారి సత్య కల్యాణ మంటపంలో ఈ వ్రతాలు నిర్వహిస్తారు. తరువాత ఉదయం 10 గంటలకు మరో బ్యాచ్‌లో కూడా వ్రతాలు నిర్వహించుకునేందుకు మహిళలను అనుమతిస్తారు. ఈ వ్రతంలో పాల్గొనే మహిళలు అరటిపండ్లు, కొబ్బరికాయ, పువ్వులు తెచ్చుకోవాలి. వ్రతానికి అవసరమయ్యే పూజా ద్రవ్యాలు దేవస్థానమే సమకూర్చనుంది. వరలక్ష్మి రూపు, జాకెట్, మట్టిగాజులు, స్వామివారి ప్రసాదం మహిళలకు అందజేస్తారు. వ్రతం అనంతరం మహిళలకు ప్రత్యేక దర్శనం, అన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొనాలని కోరారు.

కూర్చోబెడతారా ?

- నామినేటెడ్ పదవుల భర్తీపై ఎడతెగని ఊహాగానాలు
- పదవులకు దాదాపుగా పేర్లు ఖరారంటూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్
- త్వరలోనే అధికారిక జాబితా విడుదలయ్యే అవకాశమంటూ లీకులు
- పేర్లున్న వారెలాగున్నా.. లేని వారిలో ఉత్కంఠ
- రాజానగరం టీడీపీ నేత బొడ్డు వెంకటరమణ చౌదరికి ఏపీఐఐసీ ఛైర్మన్?
- పదవుల కోసం కూటమి నేతల ఎదురుచూపులు



సాక్షి, రాజమహేంద్రవరం: నామినేటెడ్ పదవుల భర్తీపై ఎడతెగని ఉత్కంఠ నెలకొంది. కొన్ని రోజులుగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తున్న విషయం విదితమే. మరో రెండు మూడు రోజుల్లో జాబితా వెల్లడయ్యే అవకాశం ఉందన్న ఊహాగానాలు విస్తృతం కావడంతో కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు గంపెడాశలు పెట్టుకుంటున్నారు. జాబితాలో తమ పేర్లు ఉంటాయని ఎవరికే వారే అంచనాలు వేసుకుంటున్నారు. సోషల్ మీడియా వేదికగా పలువురికి పదవులు ఖాయమైనట్టు పోస్టులు వస్తున్నాయి. పేరుతో కూడిన జాబితా వైరల్ అవుతోంది. త్వరలోనే వాటిలోని పేర్లే అధికారికంగా ప్రకటించే వీలుందన్న వాదన బలంగా వినిపిస్తోంది.

ఇదీ సంగతి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నామినేట్ అయిన గ్రంథాలయ, మార్కెట్ యార్డ్ చైర్మన్లు తదితర అన్ని పోస్టులు రద్దు అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే అన్ని నామినేటెడ్ పోస్టులు రద్దు చేస్తూ సీఎస్ ఉత్తర్వులు సైతం జారీ చేసిన సంగతి తెలిసిందే. రద్దు చేసిన వాటిని టీడీపీ నేతలతో భర్తీ చేస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. దీంతో తూర్పుగోదావరి జిల్లాలో నామినేటెడ్ పదవుల పందేరానికి పెద్ద ఎత్తున తెర లేచింది. ప్రభుత్వం మారిన వెంటనే సింహభాగం పదవులకు వైఎస్సార్ సీపీ నేతలు రాజీనామా చేయడంతో రోజురోజుకూ పదవులు ఆశించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ పరిణామం టీడీపీ అధిష్టానానికి తలనొప్పిగా పరిణమించింది. దీనికితోడు చంద్రబాబు ఎన్నికల ముందు జనసేన, బీజేపీతో కూటమి కట్టడంతో ఆయా పార్టీల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఆశించి భంగపడ్డ వారు సైతం పోటీకి సై అంటున్నారు. తమకు కూడా నామినేటెడ్ పోస్టులు ఇచ్చి గౌరవించాలని ఆయా పార్టీల అగ్ర నేతలను పట్టుబడుతున్నారు. ఖాళీ అయిన పదవులు మొత్తం భర్తీ చేస్తారన్న సమాచారంతో ఎవరికి వారు పావులు కదుపుతున్నారు.

బాబు, లోకేష్ హామీలతో...

సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలన్న తలంపుతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఇష్టాను సారంగా హామీలు గుప్పించారు. టీడీపీకి కార్యకర్తలు, నాయకులే ముఖ్యమని, ప్రభుత్వం ఏర్పడితే పార్టీకి వారు చేసిన సేవలకు అనుగుణంగా నామినేటెడ్ పదవుల్లో నియమిస్తామని చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ వివిధ సందర్భాల్లో ప్రకటించారు. ఎవరి మీద ఎక్కువ కేసులు ఉంటాయో వారికి మరింత ప్రాధాన్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. దీంతో పార్టీకి పనిచేసిన, కేసులు ఎక్కువగా ఉన్న నేతలంతా నామినేటెడ్ పదవులకు క్యూ కట్టారు. తమ బయోడేటాలు సిద్ధం చేసుకున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను సైతం జత చేశారు. తీరా దరఖాస్తు చేసిన అనంతరం చంద్రబాబు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నేతలకు సైతం స్థానం కల్పిస్తానని ప్రకటించడంతో టీడీపీ శ్రేణులు డీలా పడ్డాయి. మరో రెండు మూడు రోజుల్లో పదవులకు పేర్లు ప్రకటించే అవకాశం ఉందనడంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. తమ పేర్లు ఉంటాయా? లేదా? అన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి, ప్రాధాన్యం ఉన్న పదవులు భర్తీ చేస్తారన్న ప్రచారం నడుస్తోంది.

వెంకటరమణ చౌదరి వర్గంలో ఉత్కంఠ



రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరికి కీలక పదవి దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏపీఐఐసీ చైర్మన్ పదవి కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఇది అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది. ఆయన త్యాగాన్ని గుర్తించిన టీడీపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఆయన రాజానగరం టీడీపీ టికెట్ ఆశించారు. అయితే ఎమ్మెల్యే స్థానం జనసేనకు కేటాయించారు. ఇందుకు నిరసనగా వెంకటరమణ చౌదరి వర్గీయులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకునే స్థాయికి వచ్చారు. ఎలాగోలా సయోధ్య కుదిరింది. ప్రభుత్వంలో కీలక పదవి ఇచ్చి గౌరవిస్తానని స్వయంగా చంద్రబాబు నాయుడే ప్రకటించారు. అసలేం పదవి ఇస్తారు? ఎప్పుడిస్తారా? అన్న ఉత్కంఠ వెంకటరమణ చౌదరి వర్గంలో ఉంది.

శేషారావుకు శరాఘాతమేనా.?



టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఎమ్మెల్యే సీటు గల్లంతైంది. జనసేన నేత కందుల దుర్గేష్‌కు కేటాయించారు. తనను కాదని ఇక్కడి అభ్యర్థి ఎలా నెగ్గుతారో చూస్తానని పార్టీ అధినేత చంద్రబాబుకు సవాల్ విసిరే స్థాయికి పంచాయతీ చేరింది. చంద్రబాబు పిలిపించుకుని జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్, శేషారావు మధ్య సయోధ్య కుదిర్చారు. ఆ సమయంలో శేషారావుకు ఎమ్మెల్సీ ఇస్తానని బాబు హామీ ఇచ్చారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న జాబితాలో శేషారావు పేరు కనుమరుగైంది. అంటే ఈ సారి కూడా శేషారావుకు శరాఘాతమే ఎదురు కానుందా..? అన్న ప్రశ్న ఆయన వర్గీయుల్లో తలెత్తుతోంది. ఇప్పటికే నియోజకవర్గంలో శేషారావుకు సముచిత స్థానం లేదు. జనసేన నేతలే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన సర్దుబాటు

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో పూర్తి
- కొన్నిచోట్ల వ్యతిరేకతతో ఆగిపోయిన వైనం



ఉపాధ్యాయినికి బదిలీ ధ్రువపత్రం అందజేస్తున్న అర్బన్ డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో ఎట్టకేలకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా సుమారు 600 మంది మిగులు ఉపాధ్యాయులున్నారు. వీరందరికీ బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ వివరాల నమోదు ప్రక్రియ పూర్తికాగానే ఉపాధ్యాయుల సర్దుబాటు కొలిక్కిరానుంది. అయితే జిల్లాలోని పలు మండలాల్లో ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత రావడంతో సర్దుబాటు ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన సర్దుపాటు ప్రక్రియలో కొన్ని మండలాలు పూర్తవగా, ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్దుబాటు ప్రక్రియ గందరగోళానికి గురిచేస్తుండడం, కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయుల వ్యతిరేకతతో జాప్యం జరుగుతోంది. రాజమహేంద్రవరంలో జరిగిన సర్దుబాటు ప్రక్రియలో జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం మున్సిపల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు అర్బన్ ఎంఈవో బి.దిలీప్‌కుమార్, డీవైఈవో ఈ.నారాయణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రవిబాబు, ఏపీటీఎఫ్ నాయకులు లివింగ్‌స్టన్‌లు కౌన్సెలింగ్ నిర్వహించారు. మూడు సబ్జెక్టులలో కౌన్సెలింగ్ పూర్తి చేశారు. మిగిలిన సబ్జెక్టులు, సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్‌లకు సర్దుబాటు ప్రక్రియ నిర్వహించలేదు. అయితే జిల్లావ్యాప్తంగా హిందీ సబ్జెక్టు టీచర్ల కొరత అధికంగా ఉంది. సర్దుబాటు జరిగినా ఉపాధ్యాయులు తక్కువ ఉండడంతో ఈ సమస్య ఎప్పటి మాదిరే ఉండనుంది. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రైమరీ, ప్రాథమిక తరగతులకు ఆరుగురు సబ్జెక్టు టీచర్లను కేటాయించారు. విద్యార్థుల రోలు ఎంత ఉన్నా మినిమం టైంస్కేలు ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగింది.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ హర్షకుమార్‌ను అరెస్టు చేసి, వాహనంలో తరలిస్తున్న పోలీసులు



బంద్ సందర్భంగా బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

- మాజీ ఎంపీ హర్షకుమార్
- రాజమహేంద్రవరంలో ఆందోళన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ అన్నారు. భారత్ బంద్‌లో భాగంగా బుధవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల మహానాడు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా హర్ష కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సంబంధించి సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం కలసి ఎస్సీ వర్గీకరణపై కుట్రపూరితమైన తీర్పు ఇచ్చాయన్నారు. ఆర్టికల్ 341ని సవరించకుండా షెడ్యూల్డ్ క్యాస్ట్‌లో కులాలను కలపడం గాని, తీసివేయడం గాని కుదరదన్నారు. అంటరానితనం ప్రాతిపదికన ఎస్సీ కులాలు ఏర్పడ్డాయని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును దేశమంతా ఖండిస్తోందని అన్నారు. నరేంద్ర మోదీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దళితులను విభజిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మందకృష్ణను ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధానమంత్రి మోదీ, ఇతర బీజేపీ నేతలు ఓటు బ్యాంకు కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. భారత్‌బంద్ సందర్భంగా ఆందోళన నిర్వహిస్తున్న హర్షకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో అజ్జరపు వాసు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా.. భారత్ బంద్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసనలు తెలిపారు. ఎస్సీ వర్గకరణను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

జిల్లాలో పటిష్ట బందోబస్తు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): భారత్ బంద్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆయా ప్రాంతాల జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, స్పెషల్ పార్టీలు అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించాయి.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

- భారత్ బంద్ చేయడం సరికాదు
- విలేకరులతో ఆకుమర్తి చిన్న మాదిగ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆకుమర్తి చిన్న మాదిగ

రాజమహేంద్రవరం రూరల్: రాజ్యాంగ ఫలాలు అందరికీ సమానంగా అందాలని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న మాదిగ అన్నారు. బొమ్మూరులోని తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ రాజమహేంద్రవరంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయడానికి వెళుతున్న తనను హౌస్ అరెస్ట్ చేశారన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి చంద్రచూడ్ అధ్యక్షతన ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పు బహిరంగంగా వ్యతిరేకించడం బాధాకరమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల దాటినప్పటికీ మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణకు నిరసిస్తూ దేశవ్యాప్తంగా బంద్ నిర్వహించడం హర్షణీయం కాదని వ్యాఖ్యానించారు. మాలలకు నిజంగానే అన్యాయం జరిగితే శాంతియుతంగా పోరాటం ద్వారా హక్కులను సాధించుకోవాలని సూచించారు. కొన్నిచోట్ల బలవంతంగా స్కూళ్లు, కాలేజీలు మూయించారని విమర్శించారు. మాల మాదిగలు కలిసి ఉండి రాజ్యాధికారం సాధించే వైపు వెళదామని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ తెలుగు రాష్ట్రాల్లో సమస్య మాత్రమే కాదని ఉత్తరప్రదేశ్‌లో కూడా వర్గీకరణను గతంలో అన్ని పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాయని గుర్తు చేశారు. రాజకీయ, ఆర్థికంగా మాదిగలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక సభ్యులు పసలపూడి శ్రీనివాస్, రాజమండ్రి డివిజన్ అధ్యక్షులు రాచర్ల మురళి, కొమ్ము వెంకటరావు, సిందే హనుమంతు పాల్గొన్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డులకు ఐదు పాఠశాలలు ఎంపిక

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలను స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డులకు ఎంపిక చేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ దేవరపల్లి, జెడ్పీహెచ్ఎస్ రామన్నపాలెం, జెడ్పీహెచ్ఎస్ చెన్నయ్యగూడెం, ఏఎస్ఎన్ఆర్ జెడ్పీహెచ్ఎస్ దేవరపల్లి, జెడ్పీహెచ్ఎస్ బ్రాహ్మణగూడెం పాఠశాలలు ఈ అవార్డులకు ఎంపికైనట్లు చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో ప్రతిభ ఆధారంగా ఈ పాఠశాలలను ఎంపిక చేసినట్టు తెలిపారు.

‘మన బడి - మన భవిష్యత్తు’పై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

- ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ‘మన బడి - మన భవిష్యత్తు’ పనుల పురోగతిలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల పాత్ర అత్యంత కీలకమైనదని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో సర్వశిక్షా అభియాన్ పథక సంచాలకులు, ఇతర ప్రభుత్వ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో ‘మన బడి మన భవిష్యత్తు’ పై సమీక్ష, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో జిల్లాలోని 655 పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ భవనాలలో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, మనబడి మన భవిష్యత్తు అభివృద్ధి పనుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ పనులను పూర్తి చేసే క్రమంలో ఐదు శాఖల ఆధ్వర్యంలో పనులను చేపడతామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా రూ.96.33 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌కు చెందిన రూ.77.95 కోట్లకు చెల్లింపులు పూర్తి అయ్యాయన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

సామూహిక ఎలుకల నిర్మూలన

బుధవారం తన చాంబర్‌లో సాంఘిక ఎలుక నివారణ కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. 18 మండలాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎలుకల నివారణ కోసం మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,82,103 ఎకరాల్లో ఆగస్టు 25 నుంచి 31 వరకు సామూహిక ఎలుకల నివారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

వాసివాడి తస్సాదియ్యా!

- తహసీల్దార్ బదిలీకి రూ.20 లక్షల డిమాండ్
- నా వల్ల కాదంటూ వేరే చోటు చూసుకున్న తహసీల్దార్!
- రాజమహేంద్రవరం రూరల్‌లో షాడో ఎమ్మెల్యేల హడావుడి
- విస్తృతంగా బేరసారాలు



రాజమహేంద్రవరం రూరల్: అధికారం చేపట్టింది మొదలు తమ మెహర్బానీని ప్రకటించుకుంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు తమ పాత పంథాను వెలికితీశారు. తాను మారాను అంటూ ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం నాయకులు తమ పాత వాసనలను వదులుకోవడం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా వీఆర్‌ఏను ట్రాన్స్‌ఫర్ చేయడానికి లక్ష రూపాయలు వసూలు చేసిన ఘన చరిత్ర గల సదరు నేతలు ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తున్నారని ఉద్యోగుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. రాజమహేంద్రవరం రూరల్‌లో గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఎమ్మెల్యే కాగా షాడో ఎమ్మెల్యేల హడావుడి ఎక్కువైందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ‘వాసి’గా వసూళ్లు చేయడంలో నిష్ణాతుడైన నాయకుడు ఇప్పుడు బదిలీల్లో చక్రం తిప్పుతున్నట్లుగా చెబుతున్నారు. గతంలో రాజమహేంద్రవరం మున్సిపాల్టీలో ముఖ్య పదవిని చేపట్టిన సంబంధిత నాయకుడు ఇప్పుడు రూరల్‌లో గోరంట్లకు షాడోగా పెత్తనం చెలాయిస్తున్నాడన్న వాదన విన్పిస్తోంది.

గతంలో మాదిరిగా..

జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి బదిలీకి సైతం రూ.రెండు లక్షలు డిమాండ్ చేస్తుండడంతో ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అడిగింది ఇస్తేనే నచ్చినచోట పోస్టింగ్ అంటూ బహిరంగంగానే వసూళ్ల పర్వానికి తెర లేపారంటున్నారు. 2014–19లో సైతం ఇదే తరహా వసూళ్ల పర్వంతో చెడ్డపేరు మూటగట్టుకున్నారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో దీని ఫలితాన్ని స్పష్టంగానే చూశారు. అయితే త్రిముఖ పోటీ కారణంగా బుచ్చయ్య గట్టెక్కగలిగారు. అయితే అప్పటి చేదు అనుభవాలను ఏ మాత్రం పట్టించుకోని షాడో ఎమ్మెల్యేలు ప్రస్తుతం వసూళ్ల పర్వంలో తలమునకలై ఉన్నట్టుగా పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.

ఇప్పటికే రూ.9 కోట్లు ఇసుకకు రెక్కలు

రూరల్ నియోజకవర్గంలో ఒక మండలానికి వచ్చేందుకు ఆసక్తి చూపిన తహసీల్దార్‌ను రూ.20లక్షలకు పైగా డిమాండ్ చేయడంతో, సదరు తహసీల్దార్ ఈ షాడోలకు ఒక నమస్కారం పెట్టి వేరే మండలానికి బదిలీపై వెళ్లినట్టుగా చెబుతున్నారు. నియోజకవర్గం పరిధిలోని ప్రతి పోస్టుకు ఒక రేటును నిర్ణయించి, ఆ మేరకు చెల్లింపు చేస్తేనే పోస్టింగ్ అంటూ షాడో ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. బదిలీల పేరుతో ఇప్పటికే సుమారు రూ.రెండుకోట్లకు పైగా వసూలు చేశారని కూటమి నేతలే గుసగుసలాడుకోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండవ రోజునే రూరల్ నియోజకవర్గంలో రూ.9 కోట్లు విలువైన ఇసుకను మాయం చేశారన్న విమర్శలు హాట్‌టాపిక్‌గా చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే.

నేడు, రేపు అంతర్జాతీయ సదస్సు

మండపేట: మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో స్మార్ట్ మెటీరియల్‌పై అంతర్జాతీయ సదస్సు ఉంటుందన్నారు. దీనికి జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. దక్షిణ కొరియా, న్యూయార్క్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి ఐఏఎస్ఎస్, ఐఐటీ, సీట్ ప్రతినిధులు వస్తారన్నారు. ఈ సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అధ్యాపకులు కె.శ్రీనివాసరావు, కె.కిరణ్‌కుమార్, ఎ.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హుండీల ఆదాయం లెక్కింపు



మరిడమ్మ ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో హుండీల ద్వారా 29 రోజులకు సుమారు రూ.15.83 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. జాతర ఉత్సవాల ముగింపులో భాగంగా బుధవారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయ శాఖ తనిఖీ అధికారి చల్లా ఉదయ్‌బాబు నాయుడు, మహారాణి సత్రం ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్‌ల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ లెక్కింపు చేపట్టామన్నారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నిడదవోలు రూరల్: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిడదవోలు మండలం కాటకోటేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు దాసరి నాగమణిరాజును సస్పెండ్ చేస్తూ డీఈఓ వాసుదేవరావు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖాధికారుల ఆదేశాలతో పాఠశాల హెచ్ఎం ఐ.లలితరమణి ఇచ్చిన ఫిర్యాదుపై నాగమణిరాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ బుధవారం తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం కోరుపల్లికి చెందిన దాసరి నాగమణిరాజు గతంలో ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న సమయంలో ఒక విద్యార్థినిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం పొందిన నాగమణిరాజుకు తన భార్య మధ్య వివాదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో తన భర్త నాగమణిరాజు తనతో పాటు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు ఐసీడీఎస్ అధికారులు ఇటీవల పాఠశాలలో విచారణ చేపట్టి నివేదిక అందజేశారు. కలెక్టర్, డీఈఓ ఇచ్చిన ఆదేశాలతో నాగమణిరాజును సస్పెండ్ చేయడంతో పాటు పోక్సో కేసు నమోదు చేశారు.

వైద్యులపై దౌర్జన్యకాండ

- కూటమి మద్దతుదారుల వేధింపులు
- ఇద్దరు వైద్యులు విధులకు దూరం
- ఆలమూరు సీహెచ్‌సీలో ఘటనలు
- ఉన్నతాధికారుల చర్యలు శూన్యం



ఆలమూరులో సామాజిక ఆరోగ్య కేంద్రం

ఆలమూరు: వైద్యులు దైవంతో సమానం అంటారు.. అలాంటి వారిపై కూటమి మద్దతుదారుల దాడులు అధికమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. ఇక్కడ ఇటీవల కాలంలోనే ముగ్గురు వైద్యులపై దౌర్జన్యకాండ జరిగింది. ఇప్పటికే గైనకాలజిస్ట్ విభాగ వైద్యురాలు ఉద్యోగానికి రాజీనామా చేయగా, మరో వైద్యురాలు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. మరో వైద్యాధికారి మాత్రం అవమానాలు ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆలమూరులో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) ఉంది. గత ప్రభుత్వ హయాంలో రూ.ఆరు కోట్లతో అధునాతన వసతులతో సమాంతరంగా మరో ఆసుపత్రిని నిర్మించారు. రోజూ సుమారు 500 మంది రోగులు సేవలు పొందుతున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆసుపత్రిలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆసుపత్రి వైద్య సిబ్బందిపై వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయి. ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలతో తనదైన ప్రత్యేకత చాటుకున్న వైద్యురాలు ఎస్‌కే షమీ ఉన్నీసాను (ఎంఎస్) చంపేస్తానంటూ బెదిరించిన నిందితులను ఇప్పటికీ గుర్తించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఆగస్టు 16న సీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్‌లో ఆమె శస్త్రచికిత్స చేస్తుండగా, అనుమతి లేకుండా వచ్చిన ఒక వ్యక్తిని బయటకు వెళ్లాలని చెప్పిన కారణంగా అప్పటికే మద్యం తాగి ఉన్న ఆ వ్యక్తి వైద్యురాలిని నానా దుర్భాషలాడి చంపుతానని బెదిరించాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రిలో రక్షణ లేకుండా విధులు నిర్వహించలేమని ఆమె దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. ఈ ఏడాది మే 29న సీహెచ్‌సీకి ప్రసవం కోసం వచ్చిన ఇటుక బట్టీలో పనిచేస్తున్న మహిళను గైనకాలజిస్ట్ మేఘ స్పందన పరీక్షించి ఆమె ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉందని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం సత్వరమే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని సిఫారసు చేశారు. అయితే ఆ ఇటుక బట్టీ యజమాని సీహెచ్‌సీకి వచ్చి పురుడు పోయకపోతే మీరెందుకంటూ ఆ వైద్యురాలిని తీవ్రంగా దుర్భాషలాడి దౌర్జన్యం చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆ వైద్యురాలు ఆత్మాభిమానాన్ని చంపుకోలేక, జరిగిన అవమానాన్ని తట్టుకోలేక మరుసటి రోజైన మే 30న తన వైద్య వృత్తికి రాజీనామా చేశారు. దీనిపై ఇప్పటికీ విచారణ చేయలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ గైనకాలజిస్ట్‌ను నియమించక పోవడంతో గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. జూలై 31న ఓపీ విభాగం చూస్తున్న వైద్యుడు ఎం.మణిదీప్‌పై చికిత్స కోసం వచ్చిన ఓ వ్యక్తి వెంటనే వైద్యం చేయలేదంటూ దౌర్జన్యం చేశాడు. ఈ అవమానంతో కొన్నాళ్లు సెలవుపై వెళ్లిన ఆయన ఇటీవలే విధుల్లో చేరారు.

ఆకతాయిలకు అడ్డాగా..

సీహెచ్‌సీ పరిసరాలు ఆకతాయిలకు అడ్డాగా మారిపోయాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీహెచ్‌సీ పక్కనే ఖాళీ ప్రదేశం ఉండటంతో అనేక మంది యువకులు అక్కడకు చేరి మాదక ద్రవ్యాల మత్తులో అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆసుపత్రిలోని వైద్యారోగ్య సిబ్బందికి మాత్రం ప్రయోజనం చేకూరలేదు. దీంతో రాత్రి అయ్యిందంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సిబ్బంది విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటనను తలచుకుని ఆందోళన చెందుతున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా..

తమ సీహెచ్‌సీలో వైద్యురాలు ఉన్నీసాపై జరిగిన దాడిపై సూపరింటెండెంట్ పి.గోపీరామ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో, 20న జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధిత వైద్యురాలు తమ సహ వైద్యులతో కలసి ఫిర్యాదు అందించారు. జిల్లా వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఫలితం లేకపోయింది. నిందితులు కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకులు కావడం వల్లే వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన జరిగిన రెండు రోజులకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి వివరాలను నమోదు చేసుకుని వెళ్లిపోయారని తెలుస్తోంది.

రక్షణ లేకుంటే బాధ్యతలు నిర్వర్తించలేం

ఆలమూరు సీహెచ్‌సీలో పూర్తిస్థాయి రక్షణ లేకుంటే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించలేమంటూ సూపరింటెండెంట్ గోపీరామ్ దృష్టికి ఆసుపత్రి సిబ్బంది తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. సీహెచ్‌సీలో సుమారు 54 మంది వరకూ పనిచేస్తుండగా అందులో ఐదుగురు వైద్యాధికారులు, 13 మంది స్టాఫ్ నర్సులతో పాటు లాబ్ టెక్నీషియన్లు, నాలుగో తరగతి సిబ్బంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వైద్యులపై తరచూ జరుగుతున్న దాడులపై బుధవారం బాధిత వైద్యులను వివరణ కోరే ప్రయత్నం చేయగా వారు స్పందించలేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేస్తానన్నారని వైద్యురాలు ఉన్నీసా చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నకిలీ అధికారి తనిఖీలు

- ఫుడ్ చెకింగ్ అధికారినంటూ బెదిరింపులు
- అనంతరం సిబ్బందితో సెల్ఫీలు



చాగల్లులోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో సెల్ఫీ దిగిన నకిలీ అధికారి

కొవ్వూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫుడ్ చెకింగ్ నిమిత్తం తనను జిల్లా కలెక్టర్ పంపారంటూ ఓ వ్యక్తి బురిడీ కొట్టించే ప్రయత్నం చేశాడు. ఇలా ఈ నెల 1న చాగల్లులోని ఆరు కేంద్రాలు, తాళ్లపూడిలో ఒకటి, ఐ.పంగిడిలో ఆరు కేంద్రాలను తనిఖీ చేశాడు. 8న ఆరికిరేవుల గ్రామానికి వచ్చి మూడు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశాడు. ఈ కేంద్రంలో వంట సామగ్రి, సరకులు చూసి సిబ్బందిని దూషించాడు. మీ పనితీరు బాగోలేదని అంటూ బెదిరించాడు. అనంతరం సెల్ఫీలు తీసుకున్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై జిల్లా ప్రాజెక్టు అధికారి విజయకుమారికి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలసి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ వ్యవహారంపై అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఈ నెల 12న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తాను ఎవరినీ పంపలేదని బదులిచ్చారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రాజెక్టు అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పీడీ సూచనల మేరకు ఈ నెల 14న చాగల్లు, కొవ్వూరు పట్టణ, కొవ్వూరు రూరల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. బుధవారం కొవ్వూరు సీడీపీఓ డి.మమ్మి కొవ్వూరు పట్టణ పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ముగ్గురికి గాయాలు
- తక్షణ వైద్య సేవలకు కలెక్టర్ ఆదేశాలు



ప్రమాదాన్ని చూసి సహాయక చర్యలపై ఆదేశాలు ఇస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం రాజానగరంలో చోటుచేసుకుంది. ఆ వివరాల్లో వెళ్తే.. పెద్దాపురం మండలం, కొత్తూరుకు చెందిన సీహెచ్ మసిరమ్మ తన కొడుకు, కుమార్తె సీహెచ్ దుర్గాప్రసాద్, జి.వీరవెంకటలక్ష్మిలతో కలసి బైకుపై వెళ్తుండగా రాజానగరంలో జాతీయ రహదారి, ఏడీబీ రోడ్డు జంక్షన్‌లో ప్రమాదానికి గురయ్యారు. పై జంక్షన్ దాటే సమయంలో వారు ప్రయాణిస్తున్న బైక్‌ను రాజమహేంద్రవరం వైపు నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఆ ముగ్గురూ బైక్ పైనుంచి ఎగిరి దూరంగా పడ్డారు. క్షేత్ర సందర్శనలో భాగంగా అటుగా వచ్చిన కలెక్టర్ పి.ప్రశాంతి ఆ ప్రమాదాన్ని చూసి వెంటనే అవసరమైన చర్యలు తీసుకున్నారు. లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఆ ముగ్గురిని 108 అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో వేరే వాహనంలో జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఫోన్‌లో ఆసుపత్రి వర్గాలతో మాట్లాడి, తక్షణమే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సాయం.. నిలిచిన ప్రాణం

- ఆరు నెలల బాలుడికి లివర్ మార్పిడి
- కుమారుడికి లివర్ దానం చేసిన తండ్రి
- విజయవంతంగా శస్త్రచికిత్స



బాలుడితో తల్లిదండ్రులు



కోలుకుంటున్న బాలుడు

కొత్తపేట: ఆరు నెల పసివాడు అంతుపట్టని వ్యాధితో బాధపడ్డాడు. ఆ తల్లిదండ్రులు వివిధ ఆసుపత్రులకు తిప్పారు. తాత్కాలిక ఉపశమనమే తప్ప నయం కాలేదు. నాలుగో నెలలో ఉన్నత వైద్యుడిని సంప్రదించారు. లివర్ మార్పిడి చేయాలని చెప్పడంతో ఆందోళన చెందారు. చివరికి తండ్రి లివర్ దానం చేయడానికి ముందుకు వచ్చారు. అయితే అందుకు సుమారు రూ.20 లక్షలకు పైనే అవుతుందని వైద్యులు తెలిపారు. అంత స్థోమత ఆ తల్లిదండ్రులు సేవా సంస్థలు, దాతలు, ప్రజాప్రతినిధులను ఆశ్రయించారు. నిధులు సమకూరాయి. దానితో ఆపరేషన్ చేసి లివర్ మార్పిడి చేశారు.. రావులపాలెం మండలం వెదిరేశ్వరం శివారు మూలగూడేనికి చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి దంపతులకు ఫిబ్రవరి 19న మగ బిడ్డ జన్మించాడు. ఆ బాలుడికి అఖిల్ పేరు పెట్టుకున్నారు. రెండో నెల నుంచి అంతుబట్టని అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యులకు చూపించారు. మందులు వాడినా తాత్కాలికంగా తగ్గడం మళ్లీ బాధపడుతుండగా విశాఖపట్నంలో ఉన్నత వైద్యులను సంప్రదించారు. వారు లివర్ సంబంధిత వ్యాధిగా గుర్తించి, లివర్ మార్పిడి చేయాలని నిర్ధారించారు. లివర్ దానం చేయడానికి తండ్రి ముందుకు వచ్చారు. అయితే రూ.20 లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ తల్లిదండ్రులు సన్నిహితుల సలహా మేరకు కొత్తపేటకు చెందిన జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్ర కుమార్‌ను సంప్రదించారు. ఆయన తన జితేంద్ర వాట్సాప్ గ్రూపులో పసివాడి ప్రాణం కాపాడేందుకు దాతల సాయం కోరుతూ పోస్ట్ చేశారు. ఆ గ్రూపు ద్వారా సుమారు 400 మంది దాతలు స్పందించారు. రూ.7 లక్షలు సమకూర్చారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషి మేరకు పలువురు రూ.2 లక్షలు, ఇతర దాతలు రూ.4 లక్షల సాయం చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. మొత్తం రూ.23 లక్షలతో హైదరాబాద్ రెయిన్ బో ఆసుపత్రిలో మంగళవారం ప్రత్యేక వైద్యుల బృందం పసివాడికి లివర్ మార్పిడి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ సక్సెస్ అయ్యిందని, బాలుడు, తండ్రి కోలుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం



పతకంతో భార్గవ్‌రామ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయనగరం జిల్లాలో ఈ నెల 16 నుంచి 19 వరకూ జరిగిన ఏపీ సీనియర్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో కాకినాడకు చెందిన గనిశెట్టి భార్గవ్ శ్రీరామ్ పాల్గొని ప్రతిభ చాటాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. తొమ్మిదేళ్ల తరువాత భార్గవ్‌శ్రీరామ్ ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం గమనార్హం. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకూ రాజమహేంద్రవరంలో జరిగే సౌత్ జోన్ పోటీలు, త్వరలో బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ రవిబాబు

రాజమహేంద్రవరం రూరల్: విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ రవిబాబు యేలేటి రవిబాబు అన్నారు. స్థానిక కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అండర్-14, 17, 19 కేటగిరీలకు చెందిన విద్యార్థుల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 30 ఐసీఎస్‌సీ పాఠశాలలకు చెందిన 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు గురువారంతో ముగుస్తాయని రవిబాబు తెలిపారు. స్కూల్ చైర్‌పర్సన్ విజయ యేలేటి, సీఈఓ మహశ్వి యేలేటి, డీన్ హర్షిణి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, వైస్ ప్రిన్సిపాల్స్ సైదాబాబు, శ్రీవల్లి పాల్గొన్నారు.

జన గళమే జానపదం..

- మన సంస్కృతికి ఆలవాలం
- ఉమ్మడి జిల్లాలో ఎందరో కళాకారులు
- వీటికి ప్రాణం పోస్తున్న సంస్థలు
- నేడు అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవం



అంగరలో గరగ నృత్యం చేస్తున్న కళాకారులు

కపిలేశ్వరపురం: జన గళమే జానపదం.. ఇది మన సంస్కృతికి ఆలవాలం.. నేటి రోజుల్లోనూ జానపదానికి గుర్తింపు పదిలం. పూర్వపు తూర్పుగోదావరి జిల్లా జానపద కళాకారులకు పెట్టింది పేరు. కోనసీమ, గోదావరి, మెట్ట ఇలా ప్రాంతాల రీత్యా కళల, కథకుల తీరు వేరు తప్ప సారాంశమంతా మానవ ప్రయోజనమే. గురువారం అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా జానపద కళల జాడలను స్పృశిద్దాం.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 55 వేల మంది జానపద కళాకారులు ఉన్నారు.

ఇక్కడి ప్రతి ప్రాంతంలో గరగ నృత్యం, డప్పు వాయిద్యం, కోలాటం తదితర కళాకారులు ఆయా కళలను పోషిస్తున్నారు. తప్పెటగుళ్ల కళాకారులకు పెద్దాపురం, కాకినాడ పెట్టింది పేరు. మాధవపట్నానికి చెందిన తోలుబొమ్మల కళాకారులకు విశేష గుర్తింపు ఉంది. పెద్దాపురం, తదితర మెట్ట ప్రాంతాల్లో సాముగారడి గుండె ధైర్యానికి ప్రతీకగా నిలుస్తోంది. జిల్లాలో 45 శాతం భూభాగమున్న ఏజెన్సీ ప్రాంతాల్లో థింసా నృత్యం ప్రత్యేకతను చాటుతోంది. జాతరలు, వారపు సంతలు, వివాహాది శుభకార్యాల్లో ఇంటిళ్లపాదీ కోలాటం, రేలా నృత్యం లాంటి జానపద కళలను ప్రదర్శిస్తారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో 63 పంచాయతీల పరిధిలో 270 గ్రామాల్లో 83,237 మంది ప్రకృతి నియమాలకు కట్టుబడి జీవిస్తుండటంతో ఆ ప్రాంతంలో జానపద కళలు సజీవంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దళితులు గారడీ నృత్య కళను తమ భుజాలపై వేసుకుని పోషిస్తున్నారు. రామచంద్రపురం ప్రాంతంలో బుర్రకథ, కపిలేశ్వరపురం మండలంలో గంగిరెద్దుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, గరగ నృత్యం కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

జానపద నేపథ్యమిలా..

విశ్రాంతి సమయం, శ్రమ చేసేటప్పుడో జనం నోటి వెంట వచ్చిన పలుకులే జానపదాలు. రాజమహేంద్రవరానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు నేదునూరి గంగాధరం 1930లో సేకరించిన జానపద సాహిత్యంతో అక్కడి లక్ష్మీవారపుపేటలో జానపద వాఙ్మయ గ్రంథాలయాన్ని నెలకొల్పారు. తాను సేకరించిన 30 తాళపత్ర గ్రంథాలు, సాహిత్యం, 56 చిత్రపటాలు, స్వీయానుభవంతో తన రచనలను గ్రంథాలయంలో నిక్షిప్తం చేశారు. సినీనటి జమున, సి.నారాయణరెడ్డి, ఆత్రేయ తదితరులు గ్రంథాలయంలో సాహిత్య అధ్యయనం చేశారు.



డప్పు కళను ప్రదర్శిస్తున్న కళాకారులు



పల్లెసుద్దులు కళను ప్రదర్శిస్తున్న పెద్దాపురం కళాకారులు (ఫైల్)

కళ.. కృషి ఇలా..

- పెద్దాపురానికి చెందిన సాహితీ స్రవంతి అధ్యక్షుడు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు తెలుగు యూనివర్సిటీలో తాను పరిశోధన చేసిన హరిశ్చంద్ర నాటకాలు-తులనాత్మక పరిశీలన అంశాన్ని పుస్తకంగా రూపొందించి ఈ ఏడాది జూలై 21న ఆవిష్కరించారు.
- రాజమహేంద్రవరం విజయ శంకర ప్రభుత్వ సంగీత పాఠశాలలో కూచిపూడి డిప్లొమా చేస్తున్న ముగ్గురు విద్యార్థినులు మలేషియాలో జూలై 7-14 మధ్య నృత్య ప్రదర్శన ఇచ్చి గుర్తింపు సాధించారు.
- రావులపాలెం సీఆర్‌సీ ఆధ్వర్యంలో 24వ ఉగాది నాటికల పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలు నిర్వహించారు. వీటిని ఏప్రిల్ 9, 10, 11 తేదీల్లో ప్రదర్శించారు. సినీ నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు వంశీ, నటుడు కోట శంకరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
- కాకినాడ సూర్య కళామందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జూలై 10 నుంచి 14 వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించారు.
- రాజమహేంద్రవరంలో నటరాజ నృత్య నికేతన్ స్థాపించి 40 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నాట్యాచారుడు సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 2023 డిసెంబర్ 2న 125 మంది కళాకారులు 14 గంటల పాటు అతి పురాతన ఆలయ నృత్యాన్ని ప్రదర్శించారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేయూత

ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారు జామున ఆరు గంటలకే వలంటీర్ల ద్వారా ఇంటికెళ్లి ఈ కళాకారులకు పింఛను డబ్బులు అందజేసిన ఘనత గత వైఎస్ జగన్ ప్రభుత్వానికి దక్కుతుంది. రంగ స్థల సమాజాలు, పరిషత్‌లకు రూ.5 లక్షలతో వైఎస్సార్ రంగస్థల పురస్కారాలను ఇచ్చేందుకు కృషి చేసింది. కళాకారులకు గుర్తింపు కార్డులను ఇచ్చేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది.

64 కళల కలబోత ఇది..

పల్లె సుద్దులు, హరికథ, బుర్రకథ, వయోలిన్, మృదంగం, శిల్ప కళ, చేనేత కళ, గరగ నృత్యాలు, కర్రసాము, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, పులివేషం, కొర్ర గేదెలాట, కొమ్ము బూరల ప్రదర్శన, చెక్కభజన, గంగిరెద్దులాట, కోలాటం, గారడీలు, పిట్టల దొరలు, తప్పెటగుళ్లు, జముకుడి కథలు, వీర ముష్టుల శూల నృత్యం, దొమ్మరాట, తోలుబొమ్మలాట, బుడబుక్కలాట, కొమ్ముదాసరి ఆట, ఒగ్గు కథ, జోడుగుమ్మలాట, కర్రసాము, కత్తిసాము, అగ్నిగుండ ప్రదర్శన, మల్లికాసుల ఆట వంటి 64 కళల కలబోతే జానపదం.

పింఛన్ల సొమ్ము పెంచాలని..

ప్రస్తుత ప్రభుత్వంలో భాషా సాంస్కృతిక శాఖ తమ బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కళాకారులు కోరుతున్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి కళాకారునికి వృద్ధాప్య పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని కోరుతూ కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం నాయకులు ఈ నెల 6న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



జానపద కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఆ కృషి లేకపోయినప్పుడు ప్రజలు ప్రత్యామ్నాయ, ఆధునిక కళలకు అలవాటు పడతారు. ఆ ప్రమాదాన్ని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రోత్సాహకాలతో యువతను జానపద కళారంగం వైపు ఆకర్షించేలా కార్యాచరణ చేయాలి.

–దారపురెడ్డి కృష్ణ,
పల్లెసుద్దులు కళాకారుడు,
పెద్దాపురం